మూసీ పునరుజ్జీవనంపై ప్రణాళిక ఏమిటి

- అఖిలపక్షంతో చర్చించాలి
- ఆ ప్రాంతాన్ని స్పెషల్ జోన్‌గా పరిగణించి అభివృద్ధి చేయాలి
- బస్వాపూర్ ప్రాజెక్టు నిధులపై ముఖ్యమంత్రి స్పందించాలి
- సిఎంకు సిపిఎం బహిరంగ లేఖ
- సిపిఎం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాదాద్రి భువనగిరి జిల్లాలోని వలిగొండ మండలం సంగం గ్రామ మూసీ పరివాహక ప్రాంతంలో శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో సిపిఎం యాదాద్రిభువనగిరి జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ సిఎంకు గురువారం బహిరంగ లేఖ రాశారు. ఎన్నో దశాబ్దాలుగా మూసీ ప్రక్షాళన విషయంపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మూసీ పునరుజ్జీవం పేరిట ప్రక్షాళనకు ముందుకు రావడాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. ఆలోచన మంచిదే అయినా.. మూసీ పునర్జీవన పథకం.. ప్రణాళిక ఏమిటని ప్రశ్నించారు. అఖిలపక్షం సమావేశం ఏర్పాటు చేసి అన్ని పార్టీల ముందు ప్రణాళికను పెట్టాలన్నారు. గత ప్రభుత్వం ఒంటెత్తు (ఒంటెద్దు) పోకడలతో కాళేశ్వరం ప్రాజెక్టుపై నిర్ణయం తీసుకోవడంతో ప్రజలకు పూర్తిస్థాయిలో మేలు జరగలేదని గుర్తు చేశారు. పైగా పెద్దఎత్తున అవినీతి జరిగిందని పేర్కొన్నారు. అదే తరహాలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించొద్దని కోరారు. మూసీ ప్రక్షాళన హైదరాబాద్‌లోని 21 కిలోమీటర్లకే పరిమితం అవుతుందా..? ఉమ్మడి నల్లగొండ జిల్లా విషయంలో చేపట్టబోయే చర్యలను ప్రకటించాలన్నారు. మూసీ పునర్జీవనాన్ని అడ్డుకుంటే ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు ఊరుకోరని హెచ్చరించిన ముఖ్యమంత్రి.. జిల్లాలో ఎన్ని నిధులు ఖర్చు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ అభివృద్ధికి ఈ ప్రాంత ప్రజలు బాధితులుగా ఉన్నారన్నారు. ఉమ్మడి జిల్లాను డంపింగ్ యార్డ్‌గా వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. రసాయన పరిశ్రమలు, తోళ్ల పరిశ్రమలతో మూసీ కాలుష్యంతో డంపింగ్ యార్డ్‌గా మారిందని పేర్కొన్నారు.

మురుగునీటి శుద్ధి కర్మాగారాలు ఏర్పాటు చేయాలి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మురుగునీటి శుద్ధి కర్మాగారాలు (సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు) ఏర్పాటు చేయాలని, హైదరాబాద్‌తోపాటు ఈ ప్రాంతంలో తప్పకుండా ఎస్‌టిపిలు పెట్టాలని కోరారు. మూసీ కాలుష్యానికి పాలకుల నిర్లక్ష్యమే కారణమన్నారు. ఈ ప్రాంత ప్రజల ఆరోగ్యం క్షీణిస్తోందన్నారు. ఆర్థిక వనరులు, పంటలు, మత్స్య సంపద, పశుసంపద, క్షీర విప్లవ సంపదపై తీవ్రంగా ప్రభావం చూపుతోందన్నారు.

మూసీ ప్రాంతాన్ని స్పెషల్ జోన్‌గా ప్రకటించాలి

మూసీ పరివాహక ప్రాంతాన్ని స్పెషల్ జోన్‌గా పరిగణిస్తూ ముఖ్యమంత్రి ప్రకటించాలన్నారు. ప్రజల ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక సర్వే నిర్వహించాలని, వైద్య శిబిరాలు, వైద్యశాలను ఏర్పాటు చేయాలని కోరారు. బీబీనగర్ ఎయిమ్స్‌లో ప్రత్యేకమైన విభాగం ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యం అందించాలన్నారు.

రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలే ఎజెండా కావొద్దు

మూసీ ప్రక్షాళన ప్రజల ఆరోగ్యమే ఎజెండాగా ఉండాలే తప్ప, రాజకీయ ప్రయోజనాల ఎజెండాగా, ఆదాయ వనరుగా చూడొద్దని పేర్కొన్నారు. సమృద్ధిగా నిధులు కేటాయించడంతోపాటు వేగవంతంగా పనులు పూర్తి చేయాలన్నారు. ట్రీట్‌మెంట్ చేయకుండా రసాయన వ్యర్థాలను మూసీలోకి వదిలిపెడుతున్న పరిశ్రమలపై పర్యవేక్షణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు.

శాశ్వత పరిష్కారం గోదావరి జలాలు

మూసీ పునర్జీవనంలో భాగంగా మురుగు నీరు శుద్ధీకరణ చేయడంతో పాటు బస్వాపురం ప్రాజెక్టు కాలువ ద్వారా మూసీలోకి గోదావరి జలాలు తరలించడమే శాశ్వత పరిష్కారం అని జహంగీర్ చెప్పారు. మల్లన్నసాగర్ నుంచి హిమాయత్ సాగర్, గండిపేట్ చెరువులోకి నీరు తరలించి తద్వారా మూసీ కాలువలోకి పంపించాలని ప్రభుత్వం భావిస్తోందని, కానీ.. అది శాశ్వత పరిష్కారం కాదని పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజల తాగు, సాగు నీటి కోసం గోదావరి జలాలను తీసుకురావడమే పరిష్కారమన్నారు. బస్వాపురం ప్రాజెక్టును పూర్తి చేయాలని కోరారు. ఇంజినీర్లు రూ.500 కోట్లతో బస్వాపురం ప్రాజెక్టు పూర్తవుతుందని తెలిపారని, అందుకు సంబంధించిన తక్షణమే నిధులు కేటాయించి పూర్తి చేయాలన్నారు.

సిపిఎం రాజీలేని పోరాటాలు

మూసీ నీటిని ప్రక్షాళన చేయాలని సిపిఎం దశాబ్దాలుగా రాజీలేని పోరాటాలు చేస్తోందని జహంగీర్ తెలిపారు. బస్వాపురం ప్రాజెక్టును పూర్తి చేయాలని, ఈ ప్రాంత ప్రజలకు మూసీ నీటిని శుద్ధీకరణ చేసి పిలాయిపల్లి, ధర్మారెడ్డి, బొల్లేపల్లి, భీమ లింగం కాల్వలను పూర్తిచేయాలని పోరాటాలు చేసిందన్నారు. వినతిపత్రాలు, ఆందోళన, సంతకాల సేకరణ, బస్సు చైతన్య యాత్రలు, పాదయాత్రలు 48 గంటలు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు వంటా వార్పుతో ప్రజలను చైతన్యవంతం చేసి పోరాడినట్టు గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిపిఎం ప్రశ్నలకు స్పందించాలని డిమాండ్ చేశారు. సిపిఎం చేసిన పోరాటాల ఫలితంగానే ప్రభుత్వంలో కదలికలు వచ్చాయని బహిరంగ లేఖలో పేర్కొన్నారు.

కులగణనతో పేదల చదువుకు ఆటంకం లేకుండా చూడాలి

- ఎస్ఎఫ్ఐ

హైదరాబాద్ బ్యూరో : ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను కులగణన సర్వే విధులను నిర్వర్తించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల పేద విద్యార్థులు విద్యపై తీవ్ర ప్రభావం పడుతుందని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు తెలిపారు. ఆ విద్యార్థుల చదువులకు ఆటంకాలు లేకుండా సర్వే చేపట్టాలని గురువారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో కొన్ని ప్రాథమిక పాఠశాలల్లో ఒకే టీచర్ రెండు, మూడు సబ్జెక్టులు బోధించే పరిస్థితి ఉందని తెలిపారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్న దగ్గర విద్యార్థులు చదువులు నష్టపోయే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఏడాదిలో వర్షాల వల్ల ఎక్కువ రోజులు సెలవులు రావటం వల్ల విద్యార్థులకి ఇప్పటి వరకు సిలబస్ పూర్తి కాలేదని తెలిపారు. ప్రాథమిక విద్యలో ఫౌండేషన్ అత్యంత కీలకమనీ, ఒంటిపూట బడుల వల్ల తీవ్ర నష్టం పేదవిద్యార్థులకు జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలను యథాతథంగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. లేదంటే షిఫ్ట్ పద్ధతిలో అయినా ఉపాధ్యాయులను విడతల వారీగా వినియోగించుకుని ప్రాథమిక పాఠశాలలను పూర్తిస్థాయిలో నడపాలని సూచించారు.

దాశరథి రచనలు జాతిని జాగృతం చేశాయి

ప్రజాశక్తి - కల్చరల్

దాశరథి కృష్ణమాచార్య రచనలు జాతిని జాగృతం చేశాయని తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ నందిని సిధారెడ్డి అన్నారు దాశరథి 37 వ వర్ధంతి సందర్భంగా రవీంద్ర భారతి ప్రాంగణం లోని సాహిత్య అకాడెమీ కార్యలయంలో జరిగిన సమావేశంలో.. దాశరథితో అనుబంధం వున్న వారు అభిమానులు పాల్గొన్నారు .ముఖ్య అతిథిగా సిద్ద రెడ్డి పాల్గొని దాశరథి రాసిన కథల సంపుటి నిప్పు పూలు ఆవిష్కరించి మాట్లాడారు. దాశరథి సంస్మరణగా స్మారక భవనం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సంపుటి లోని కథల విశిష్టతను తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ నలేశ్వరం శంకరం వివరించారు సీనియర్ జర్నలిస్ట్ ఉడయవర్లు మాట్లాడుతూ, దాశరథితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆనంద చారి మాట్లాడుతూ.. దాశరథి కథలలోని ధిక్కార తత్వం విశ్లేషించారు. దాశరది సినీ గీతాలు, సంస్కృత కీర్తనలపై శరత్ చంద్ర మాట్లాడారు. దాశరథి కుమార్తె, అల్లుడు మాట్లాడుతూ..సచివాలయంలో ఏర్పాటు చేసే తెలంగాణ తల్లి విగ్రహం శిలా ఫలకంలో 'నా తెలంగాణ కోటి రత్నాల వీణ' మాటలను పొందు పరిచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రఘు గంట మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శైకత శిల్పంతో సిఎంకు జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టుసాయికుమార్ సిఎంకు ఓ కానుకను ఇచ్చారు. సైకత శిల్పాలకు పేరొందిన ఒడిశాలోని పూరి బీచ్‌లో బుధవారం రేవంత్ సైకత శిల్పాన్ని వేయించి.. ఆయనకు బర్త్‌డే గిఫ్ట్ అందజేశారు. సైకత శిల్పం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. రేవంత్ అభిమానులు సైతం ఈ శిల్పాన్ని ప్రశంసిస్తున్నారు.

జిన్నింగ్ మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు చేయాలి

- మంత్రి తుమ్మల

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పత్తి కొనుగోళ్ల వివరాలను ఇప్పటికప్పుడు రైతులకు అందించేలా రాష్ట్ర ప్రభుత్వం 'వెబ్ పోర్టల్'ను సిద్ధం చేసినట్టు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. దీని ద్వారా సిసిఐ ఇప్పటి వరకు ఎంత పత్తి కొనుగోలు చేసిందో, ఎన్ని క్వింటాళ్ల పత్తిని తిరస్కరించిందో ఈ వెబ్ పోర్టల్‌లో చూడవచ్చునని చెప్పారు. మార్కెటింగ్ అధికారులు, ప్రాంతీయ అధికారులు జిన్నింగ్ మిల్లులను ఆకస్మిక తనిఖీలు చేసి, రిపోర్టును డైరెక్టర్ మార్కెటింగ్ శాఖకు అందించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచనమేరకు వరి కొనుగోలు కేంద్రాల పర్యవేక్షణ అధికారులు పత్తి కొనుగోలు కేంద్రాలను కూడా పర్యవేక్షించాలని కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో పత్తి కొనుగోళ్లపై మంత్రి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా అధికారులు జిన్నింగ్ మిల్లులను ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆదేశించారు. రైతులకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తూ రాష్ట్రంలో మేజర్ మార్కెట్ కమిటీలను ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు.

క్రిమ్సన్ స్కూల్‌కు వెల్ హెల్త్ సేఫ్టీ రేటింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటర్నేషనల్ వెల్ బిల్డింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఐడబ్ల్యుబిఐ) నుండి ప్రతిష్టాత్మకమైన వెల్ హెల్త్-సేఫ్టీ రేటింగ్ (వెల్ హెచ్ఎస్ఆర్) అందుకున్నట్లు క్రిమ్సన్ తెలిపింది. శారీరక, మానసిక ఆరోగ్యంను పెంచే చర్యలను చేపట్టినందుకు గాను మొదటి భారతీయ పాఠశాలగా ఈ గుర్తింపును పొందినట్లు పేర్కొంది. తమకు హైదరాబాద్, బెంగళూరులో ఐదు క్రిమ్సన్ పాఠశాలు ఉన్నాయని తెలిపింది. భవనాలు, స్వచ్ఛమైన గాలి, శుద్ధి నీరు, శానిటైజేషన్ తదితర 29 ప్రమాణాలలో 16 ప్రమాణాలను తమ స్కూల్ చేరుకోవడం ద్వారా ఈ సర్టిఫికేషన్ దక్కిందని తెలిపింది.

ఆటంబాంబు పేలబోతోంది...

- పేదల సొమ్ముతో ఆస్తులు పెంచుకొని సోకులా?
- తప్పుచేయని వాళ్లకు ఉలికిపాటు ఎందుకు? : మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

త్వరలో ఆటమ్‌బాంబు పేలుతుందంటూ రెవెన్యూ,గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వరంగల్ జిల్లాలో గురువారం పలు అభివృద్ధి పథకాలకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి వర్ధన్నపేటలో నిర్వహించిన సభలో మాట్లాడారు. "రాజకీయ బాంబు పేలబోతోందన్న తన వ్యాఖ్యలపై బిఆర్ఎస్, బిజెపి నాయకులు జోక్ చేశారు. ఇప్పుడు నాటు బాంబు కాదు..లక్ష్మీబాంబూ కాదు.. తప్పు చేసిన వాళ్లకు ఆటమ్‌బాంబు పేలబోతోంది. తప్పుచేయని వారికి ఏమీ కాదు.. ఉలిక్కిపడాల్సిన అవసరం లేదు. పేదలకు పంచాల్సిన సొమ్ముతో అక్రమమార్గంలో ఆస్తులు పెంచుకుని సోకులు పడతారా..? రూ.58కోట్ల ప్రజాధనం ఎక్కడ నుంచి ఎవరి ద్వారా విదేశాలకు ఎలా బదిలీ చేశారో ప్రజలకు వివరిస్తాం. చట్టం ఎవరికీ చుట్టం కాదు, తప్పుచేసిన వారిని ప్రజా క్షేత్రంలో దోషులుగా నిలబెడతాం." అని పొంగులేటి అన్నారు. నన్ను త్వరలో జైలులో పెడతారంటూ మాజీ మంత్రి కెటిఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి తనదైన శైలిలో స్పందించారు. ఉత్తుత్తి బాంబే...బాంబు తుస్సుమంది...అన్న నాయకులు ఇప్పుడు..నన్ను జైల్లో పెడితే యోగా చేసి స్లిమ్మయ్యి పాదయాత్రకు రెడీ అవుతా అనడం ఆశ్చర్యం కల్గిస్తోందని చెప్పారు. ఎవర్నీ జైలుకు పంపాలనే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదని మంత్రి స్పష్టంచేశారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్రానికి రూ.7 లక్షల కోట్లకుపైగా అప్పులున్నా.. సంక్షేమ పథకాలను నిర్విరామంగా అమలు చేస్తున్నామన్నారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యానికి 11 నెలలు నిండాయని పొంగులేటి చెప్పారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటామని, ఇందిరమ్మ రాజ్యం పేదల కోసమే పనిచేస్తుందని మంత్రి పొంగులేటి పునరుద్ఘాటించారు.

ప్రతి ఎకరాకూ సాగునీరు

- మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతి ఎకరాకూ సాగు నీరు అందించేందుకు కృషి చేస్తున్నామని ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. యదాద్రి భువనగిరి జిల్లా, యాదగిరిగుట్ట మండలం జంగంపల్లి వద్ద ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ పాయింట్ నుంచి గురువారం దిగువ గ్రామాలకు నీటిని నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల, రైతుల మీద ప్రేమతో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తుందన్నారు. రైతు భరోసా ఇస్తామని, మిగిలిపోయిన రైతు రుణమాఫీ తప్పకుండా చేస్తామని అన్నారు. మూసీ ప్రక్షాళన చేసి తీరుతామన్నారు. గంధమల్ల కోసం గత ప్రభుత్వాలతో ఎంతో కొట్లాడామన్నారు. గతంలో నష్టపోయిన ఈ ప్రాంతానికి ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం నీరు అందించి సస్యశ్యామలం చేస్తుందని భరోసా ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వంతో కొట్లాడి రోడ్లు తెస్తున్నామన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాను ఈ నాలుగేండ్లలో అభివృద్ధి చేస్తామన్నారు. ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ. బస్వాపూర్‌కు పోయే కాలువలను, ఇక్కడ డిస్ట్రిబ్యూషన్ పాయింట్స్ ఏర్పాటు చేసి చెరువులకు నీరు అందించే సంకల్పం ఎంతో గొప్పదన్నారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. జలయజ్ఞంలో భాగంగా ఆలేరు నియోజకవర్గానికి ఇప్పటికే నలుమూలలకు నీరు అందించామన్నారు. మరో 20 గ్రామాల చెరువులు, కాల్వలకు నీరు అందించనున్నామని చెప్పారు. జంగంపల్లి వద్ద ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ పాయింట్ ద్వారా యాదగిరిగుట్ట మండలం జంగంపల్లి, ధాతర్‌పల్లి, రాళ్ళ జనగం, మల్లాపూర్, సైదాపూర్, మాసాయిపేట, తాళ్ల గూడెం, మైలర్‌గూడెం తదితర గ్రామాలకు నీరు చేరుతుందని వివరించారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి : జాక్టో

హైదరాబాద్ బ్యూరో : రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్‌లో జాక్టో చైర్మన్ జి సదానందంగౌడ్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో సెక్రటరీ జనరల్ కె కృష్ణుడు, కోశాధికారి జి హేమచంద్రుడు, ప్రచార కార్యదర్శి ఎండీ అబ్దుల్లా, గౌరవ సలహాదారులు ఎం పర్వత్‌రెడ్డి, కో-చైర్మన్లు కె చైతన్య, పి చంద్రశేఖర్, డిప్యూటీ సెక్రటరీ జి నగేష్ యాదవ్, దానయ్య, టి గీతాంజలి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఒక ప్రకటన విడుదల చేశారు. పిఆర్‌సి నివేదికను వెంటనే తెప్పించుకుని ఉద్యోగ సంఘాలతో చర్చించి ఫిట్‌మెంట్‌ను ప్రకటించాలని తెలిపారు. ఉద్యోగులకు సంబంధించి అన్ని రకాల పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని పేర్కొన్నారు. 317 జీవోపై మంత్రివర్గ నిర్ణయాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించి, పదోన్నతులు కల్పించాలని సూచించారు. అన్ని రకాల యాజమాన్యాల్లోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఈహెచ్ఎస్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. పారిశుధ్య కార్మికుల వేతనాలు అమ్మ ఆదర్శ పాఠశాల అకౌంట్‌లో జమ చేయాలని పేర్కొన్నారు. కెజిబివి, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు మినిమం టైంస్కేల్‌ను ఇవ్వాలని తెలిపారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలకూ ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

శ్రీచైతన్య విద్యా సంస్థల్లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్‌పర్సన్ డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదినం సందర్భంగా శ్రీచైతన్య విద్యాసంస్థలు, మెడికవర్, ఎన్‌టిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని గురువారం నిర్వహించాయి. ఏపి, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు నాలుగు రాష్ట్రాల్లో శ్రీచైతన్య కళాశాలలు, పాఠశాలల్లో 3,700 మందికిపైగా సిబ్బంది 3,700 యూనిట్లకుపైగా రక్తాన్ని దానం చేసి సేవాస్ఫూర్తిని ప్రదర్శించారు. అందులో భాగంగా మియాపూర్ శ్రీచైతన్య స్కూల్‌లో 300 మందికిపైగా సిబ్బంది రక్తదానం చేశారు. శ్రీచైతన్య విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ, శ్రీచైతన్య స్కూల్ అకడమిక్ డైరెక్టర్ సీమ బొప్పన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రక్తదాన శిబిరంలో సిబ్బంది పాల్గొని ఆదర్శంగా నిలిచారని తెలిపారు. విద్యలోనే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటామని పేర్కొన్నారు. తమ మాతృమూర్తి జన్మదినం సందర్భంగా సూపర్ హ్యాట్రిక్ ప్రపంచ రికార్డు అనే మైలురాయిని శ్రీచైతన్య విద్యాసంస్థలు అధిగమించడం పట్ల విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

కొడుకును కిరాతకంగా హత్య చేసిన తండ్రి

- 25 రోజుల క్రితమే వ్యవసాయ పొలంలో పూడ్చివేత
- మాడ్గుల పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన నిందితులు
- గుడితండా గ్రామపంచాయతీలో ఘటన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కన్న కొడుకును తండ్రే అతి కిరాతకంగా హత్య చేశాడు. పెద్ద కొడుకుతో కలిసి దారుణానికి ఒడిగట్టాడు. తమ వ్యవసాయ పొలంలో శవాన్ని పూడ్చిపెట్టాడు. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం గుడితండా గ్రామ పంచాయతీలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మాడ్గుల సిఐ జగదీష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గుడితండా గ్రామానికి చెందిన రాత్లావత్ లక్ష్మణ్‌కు ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు నరేష్, చిన్న కొడుకు సురేష్ (29). కాగా, 40 ఏళ్లుగా వీరి కుటుంబం జీవనం కోసం హైదరాబాద్ వచ్చి బాగ్ లింగంపల్లిలో ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. గత నెల అక్టోబర్ 11న దసరా పండుగ సందర్భంగా సొంత గ్రామం గుడితండాకు వచ్చారు. అక్టోబర్ 13వ తేదీన తండ్రి లక్ష్మణ్, పెద్దకొడుకు నరేష్ ఇద్దరు కలిసి మద్యం మత్తులో చిన్న కొడుకు సురేష్‌ను మటన్ కొట్టే కత్తితో పలుసార్లు దాడి చేసి కిరాతకంగా చంపారు. మృతదేహాన్ని ఆటోలో తీసుకెళ్లి పొలంలో గుంత తీసి పూడ్చిపెట్టారు. అనంతరం ఎవరికి అనుమానం రాకుండా నిందితులు ఇద్దరూ హైదరాబాద్‌కు వెళ్లారు. బుధవారం తండాలో ఈ నూట ఆ నోట పుకార్లు, షికార్లు లేవడంతో అదే రోజు సాయంత్రం తాము ఆస్తి కోసం వ్యక్తిని హత్య చేశామని ఇద్దరు తండ్రీ కొడుకు మాడ్గుల పోలీస్ స్టేషన్‌కు వచ్చి తప్పును ఒప్పుకుని లొంగిపోయారు. గురువారం తహసీల్దార్ వినయ్‌సాగర్ సమక్షంలో శవాన్ని వెలికి తీసి పంచనామా నిర్వహించారు. ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సిఐ తెలిపారు.

ఎన్ఇపిని రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించాలి

- ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి
- ప్రయివేటు విద్యాసంస్థలను నియంత్రించాలి
- ఆకునూరి మురళితో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, టిఎస్‌యుటిఎఫ్ నేతల భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేదలకు విద్యను దూరం చేసే జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి-2020)ని రాష్ట్రంలో అమలు జరపకుండా ప్రభుత్వం తిరస్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) డిమాండ్ చేసింది. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరింది. ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు, వాటి వ్యాపారాన్ని నియంత్రించాలని సూచించింది. గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళితో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి నేతృత్వంలో భేటీ అయ్యారు. మూడు గంటలపాటు జరిగిన ఈ సమావేశంలో విద్యారంగంలోని క్షేత్రస్థాయి సమస్యలను, అభిప్రాయాలను వివరించారు. ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించాలని కోరారు. తరగతికొక టీచర్, గది ఉండాలనీ, పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో పాఠశాలల రీ లొకేషన్ జరగాలని సూచించారు. తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా ఆకర్షణీయమైన పాఠశాలలు, పటిష్టమైన పర్యవేక్షణ, సమర్థవంతమైన బోధన ఉండాలని విజ్ఞప్తి చేశారు. గురుకులాల్లో శాస్త్రీయ పద్ధతిలో టైం టేబుల్‌ను నిర్ణయించాలని, ఏకరూప పాలన ఏర్పాటు చేయాలని తెలిపారు. రాష్ట్రంలో ఎయిడెడ్ పాఠశాలలను స్వాధీనం చేసుకోవాలనీ, మోడల్ స్కూళ్లను విద్యాశాఖలో విలీనం చేయాలని పేర్కొన్నారు. గిరిజన పాఠశాలలకు పోస్టులను, కేజీబీవీ టీచర్లకు కనీస వేతనాలు ఇవ్వాలనీ, మెస్ చార్జీలను గురుకులాలతో సమానంగా పెంచాలని కోరారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలనీ, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం స్నాక్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. డిఇఒ, డిప్యూటీ ఇఒ, ఎంఇఒ పోస్టులను మంజూరు చేసి భర్తీ చేయాలని పేర్కొన్నారు.

ఆకునూరి మురళికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ఈ సందర్భంగా ఆకునూరి మురళి మాట్లాడుతూ విద్యార్థి కేంద్రంగా విద్యావ్యవస్థ అభివృద్ధి కావాలని చెప్పారు. పెద్ద పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని అన్నారు. ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని పెంచేందుకు, పాఠశాలల అభివృద్ధికి గ్రేడింగ్ ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. కీలక భాగస్వాములైన ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల అభిప్రాయాలను సేకరించి సిఫారసులను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎం రాజశేఖరరెడ్డి, డి సత్యానంద్, పి మాణిక్ రెడ్డి, జె యాకయ్య, నాయకులు గోపాల్ నాయక్, వెంకటప్ప, మదన్‌రెడ్డి, వందన, నవీన్‌రెడ్డి, యాదయ్య, నాగయ్య, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డా.ఎల్లాప్రగడ సుబ్బారావు ఆదర్శప్రాయుడు

ప్రజాశక్తి - కల్చరల్ : భారత దేశంలో చరకుడు వంటి వారు వైద్య విద్యలో ఎన్నో పరిశోధనలు చేసినా వాటికి పేటెంట్ హక్కు లేనందున ప్రాచుర్యం లోకి రాకపోవటం దురదృష్టం అని శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు. అదే కోవలో ఎల్లాప్రగడ సుబ్బారావు వైద్య శాస్త్రం పలు రుగ్మతలకు పరిశోధనలు చేసినా ఆయనకు రావలసినంత గుర్తింపు రాలేదని అవేదన వ్యక్తం చేశారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు యాదిలో సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మధుసూదనా చారి మాట్లాడుతూ ఎల్లాప్రగడ సుబ్బారావు వివిధ రసాయన సమ్మేళనాలతో ప్రయోగాలు చేసి ఫోలిక్ ఆమ్లం కనిపెట్టారనీ, ఇది రక్తంలోని హిమోగ్లోబిన్ క్షీణతను అరికట్టడంలో దోహద పడుతుందని చెప్పారు. సాహితీ కిరణం పత్రిక సంపాదకుడు పొత్తూరి సుబ్బా రావు మాట్లాడుతూ ఎల్లాప్రగడ సుబ్బారావు తెలుగు వారు కావటం మనకు గర్వకారణం కాగా ఆయనకు దురదష్టం అన్నారు. టి బి, డయేరియా వంటి రుగ్మతలకు చికిత్స విధానాన్ని సుబ్బారావు కనిపెట్టినా అయన పేరు ప్రఖ్యాతులు పొందలేదని చెప్పారు. సంప్రదాయ కుటుంబంలో పుట్టినా అభ్యుదయ భావాలతో మూఢ ఆచారాలను వ్యతిరేకించారని వివరించారు. యువ కళా వాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రచారాలకు దూరంగా వున్న ఎల్లాప్రగడ సుబ్బారావు ఆదర్శ నీయుడు అని చెప్పారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో గరిమెళ్ల సీత, పాల్గొన్నారు.

ప్రజల మనిషి వట్టికోట

- విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ విశ్వేశ్వర రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సామాజిక చింతనతో జీవితాన్ని సమాజ శ్రేయస్సు కు అంకితం చేసిన ప్రజల మనిషి వట్టికోట ఆళ్వారుస్వామి అని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ విశ్వేశ్వర రావు నివాళి అర్పించారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సంగీత నాట్య వేదికపై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా వట్టికోట ఆళ్వారుస్వామి యాదిలో సంస్మరణ సమావేశం జరిగింది.ముఖ్య అతిథిగా జస్టిస్ విశ్వేశ్వర రావు పాల్గొని మాట్లాడారు. పేదరికం నుంచి ఎన్నో బాధలను భరించి తెలంగాణ సాహితీ కిరణంగా నిలిచిన వట్టికోట ఆళ్వారుస్వామి చరిత్ర నేటి తరాలకు కర దీపిక కావాలని అన్నారు. గోల్కొండ పత్రికలో ప్రూఫ్ రీడర్‌గా తదుపరి దేశోద్ధారక గ్రంథ మాల ద్వారా ప్రముఖులు రచనలు ప్రచురణ కర్తగా మారిన ఆళ్వార్ స్వామి స్వయంగా రచయిత అని తెలిపారు. అయన రచించిన ప్రజల మనిషి, నిజాం కాలంలో ప్రజల అవస్థలుకు దర్పణం పట్టిందన్నారు. దాశరథి కృష్ణమాచార్యతో జైలులో సహజీవనం చేశారని గుర్తు చేశారు. కవి రఘు శ్రీ మరొక కవి చిక్క రామ దాసు మాట్లాడుతూ ఆళ్వార్ స్వామి తెలుగు తల్లి మాస పత్రిక నడిపారనీ, కమ్యూనిస్టు ఆలోచన విధానంతో అభ్యుదయ రచయితల సంఘం, తెలంగాణ రచయితల సంఘంలోనూ క్రియా శీలంగా పని చేశారని వివరించారు. అధ్యక్షత వహించిన గానసభ అధ్యక్షులు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ ఆళ్వార్ స్వామి శత జయంతి 2014లో అప్పటి ప్రభుత్వం జరిపినా.. ఆయన సదా స్మరణీయులు అన్నారు. అయన జయంతి విధిగా జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. గాన సభ పాలక సభ్యురాలు గుండవరపు గీతా దేవి, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE IV ADDITIONAL JUNIOR CIVIL JUDGE: AT: VIJAYAWADA.

I.A. No. 308/2023 in O.S.No. 1099/2023

Between:

Chokkapu Srinivasa Rao ...Plaintiff.

And

Gujjarlapudi Rajeev Babu
S/O Alfred, christian,
Resident D.NO.12-2-717/1/49,
Sapthagiri Nagar, Asifnagar,
Humayun nagar, Hyderabad-28

.... Defendant.

Please take notice that the above suit is filed against you for declaration and permanent injunction and the same is posted on 25-11-2024 for your appearance. Therefore you are hereby directed to appear on 25-11-2024 at 10.30 a.m. either in person or through an Advocate before the Honourable Court and in default the matter will be decided exparte.

(BY ORDER OF THE HONOURABLE COURT)

T.V.Dasaradha Ramesh
Advocate for Plaintiff
payakapuram
Vijayawada -15
Cell -9966096999.

ఎసిబికి చిక్కిన విద్యాశాఖ అధికారి

- ఉపాధ్యాయురాలి నుంచి రూ.50 వేల లంచం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖ ఇన్‌చార్జి అధికారి రవీందర్ రూ.50 వేలు లంచం తీసుకుంటూ గురువారం ఎసిబికి పట్టుబడ్డారు. అవినీతి నిరోధక శాఖ డిఎస్‌పి కృష్ణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల ప్రభుత్వం ఉపాధ్యాయుల ప్రమోషన్స్ కల్పించిన విషయం విదితమే. ఒకే సామాజిక తరగతికి చెందిన తన కన్నా చిన్న వయసు ఉన్న వారికి ప్రమోషన్స్ వచ్చాయని, తనకు సీనియార్టీ దక్కలేదని ఓ ఉపాధ్యాయురాలు విద్యాశాఖ ఇన్‌చార్జి అధికారి రవీందర్‌ను సంప్రదించారు. తనకు న్యాయం చేయాలని పలుమార్లు కలిశారు. ఉద్యోగోన్నతుల విషయం కోర్టులో ఉందని, ముందుగా కోర్టుకు వెళ్లి అనుమతి తీసుకోమని ఆ అధికారి సూచించారు. ఆమె ఇటీవల కోర్టు నుంచి అనుమతి తీసుకొచ్చానని విద్యాశాఖ అధికారిని కలువగా.. రెండు లక్షల రూపాయల లంచం డిమాండ్ చేశారు. దాంతో ఆమె ఎసిబి డిఎస్‌పి కృష్ణగౌడ్‌ను ఆశ్రయించారు. ఎసిబి అధికారుల సూచన మేరకు.. ఆ ఉపాధ్యాయురాలు గురువారం ఉదయం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని శ్రీనివాస కాలనీలో ఉన్న అధికారి ఇంటికెళ్లాడు. రూ.50 వేలు ఇస్తుండగా.. రవీందర్‌ను పట్టుకున్నారు. నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

మహిళ మెడలోంచి పుస్తెలతాడు చోరీ

- చైన్ స్నాచింగ్‌తో ఉలిక్కిపడిన టేకుమట్ల ప్రజలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓ మహిళ మెడలో నుంచి పుస్తెలతాడును గుర్తుతెలియని ఇద్దరు యువకులు లాక్కెళ్లిన ఘటన జయశంకర్-భూపాలపల్లి జిల్లా టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల్లోని రాఘవరెడ్డిపేట- ఉప్పలపల్లి గ్రామాల మధ్య బుధవారం జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన పులి గోర్ల వనజ-చేరాలు వారి పత్తి పంటను కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని మార్కెట్ యార్డులో అమ్ముకున్నారు. తిరిగి వారి బంధువుల ఇంటి వద్ద జరగనున్న ఫంక్షన్‌కు వారి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల్లోని రాఘవరెడ్డిపేట- ఉప్పలపల్లి గ్రామ శివారులో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు పల్సర్ బైక్‌పై హెల్మెట్, మాస్కులు ధరించి వారి ద్విచక్ర వాహనం వద్దకు వచ్చి వనజ మెడలో నుంచి పుస్తెలతాడుకు లాక్కెళ్లారు. దాంతో వనజ - చేరాలు అరుపులు, కేకలు పెట్టగా గ్రామస్తులు ఉలిక్కిపడి నిందితులను ఆపే ప్రయత్నం చేయగా తప్పించుకుని పరారయ్యారు. పుస్తెలతాడు.. సుమారు మూడున్నర తులాలు ఉన్నట్టు బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ గోగికారి ప్రసాద్ తెలిపారు.

ఎజిఐ గ్రీన్‌ప్యాక్‌కు రూ.72 కోట్ల లాభాలు

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో ఎజిఐ గ్రీన్‌ప్యాక్ నికర లాభాలు 28.39 శాతం పెరిగి రూ.72.08 కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.56.14 కోట్ల లాభాలు చోటు చేసుకున్నాయి. ఇదే సమయంలో రూ.614 కోట్లుగా ఉన్న నికర అమ్మకాలు.. గడిచిన క్యూ2లో 2.55 శాతం తగ్గి రూ.599 కోట్లుగా నమోదయ్యాయి.

ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ లాభాల్లో 45 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ 2024 సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో 45 శాతం వృద్ధితో రూ.11.2 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.7.2 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన సెప్టెంబర్ త్రైమాసికంలో 58 శాతం వృద్ధితో రూ.674 కోట్ల రెవెన్యూ సాధించింది.

రూ.126 కోట్ల నిధులు సమీకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ : బై నౌ పే లేటర్ (బిఎన్‌పిఎల్) బి2బి పరిష్కారాలను అందించే ఫిన్‌టెక్ సంస్థ మోడిఫై తాజాగా 15 మిలియన్ డాలర్ల (రూ.126 కోట్లు) నిధులు సమీకరించినట్లు తెలిపింది. ఈ ఫండింగ్ రౌండ్‌కు జపాన్‌లోని ప్రముఖ బ్యాంకు సుమిటోమో మిట్సూఈ బ్యాంకింగ్ కార్పొరేషన్ (ఎస్ఎంబిసి) నేతృత్వం వహించిందని వెల్లడించింది. కాగా.. మాఏర్స్, ఇంటేసా సంపాలో, హెలియాడ్ వంటి ప్రముఖ గ్లోబల్ ఇన్వెస్టర్లు పాల్గొన్నారని తెలిపింది. ఎస్ఎంబిసితో మోడిఫై అవగాహన కుదుర్చుకోవడం ద్వారా ఎస్ఎంఇ ఎగుమతిదారులకు డిజిటల్ పరిష్కారాలను అందించనున్నట్లు పేర్కొంది.

సబ్సిడీ టార్పాలిన్లు అందేనా?

- వర్షాకాలంలో రైతులకు తప్పని ఇక్కట్లు
- కొన్నిచోట్ల ప్రభుత్వం ఏర్పాటు.. మరికొన్నిచోట్ల పట్టించుకోని అధికారులు
- టార్పాలిన్ల డిమాండ్‌తో.. అద్దెకు తీసుకుంటున్న రైతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వర్షాలు కురుస్తుండడంతో ధాన్యం తడవకుండా ఉండేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. టార్ఫలిన్లు అందుబాటులో ఉంచుతామని ప్రభుత్వం చెప్పినా.. రాష్ట్రంలో పలు కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు ఉంచలేదు. కొన్ని కేంద్రాల్లో ఉంచినా అవి సరిపోవడం లేదు. కోతల సమయంలో ధాన్యాన్ని ఆరబెట్టేందుకు, వర్షాల భారీ నుంచి కాపాడుకోవడానికి అవస్థలు పడుతున్నారు. దాంతో టార్ఫలిన్లకు డిమాండ్ పెరిగింది. తప్పని పరిస్థితుల్లో రైతులు డబ్బులు చెల్లించి అద్దెకు టార్పాలిన్లు తెచ్చుకుంటూ ఆర్థికంగా నష్టపోతున్నారు. ఎక్కువ అద్దె చెల్లించాల్సి రావడంతో ప్రభుత్వం సబ్సిడీ రూపంలో టార్ఫలిన్లు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

జయశంకర్-భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలం మల్హర్‌రావు మండలవ్యాప్తంగా సుమారు 9500మంది రైతులు ఉన్నారు. ఈ ఖరీఫ్‌లో 10700 ఎకరాల్లో వరి సాగు చేయగా 4850మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే ధాన్యం కోతలు ప్రారంభయ్యాయి. పిఎసిఎస్, డిసిఎంఎస్ ఆధ్వర్యంలో మొత్తం 22 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నారు. రేపటి నుంచి కొండంపేట గ్రామంలో గురువారం మంత్రితో కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నారు. మొత్తం సుమారు ఐదు వేల టార్పాలిన్లు అవసరమవుతాయని రైతులు అంటున్నారు. ఇప్పటి వరకు టార్పాలిన్లు మండలానికి వచ్చిన దాఖలాలు లేవని తెలిసింది. ఈ క్రమంలో ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులకు టార్పాలిన్లు అందుబాటులో లేక అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై ఐదారేళ్ల క్రితం ఎనిమిది ఫీట్ల పొడవు, ఆరు ఫీట్ల వెడల్పుతో మందం ఉన్న టార్పాలిన్‌లను వ్యవసాయశాఖ తరఫున రైతులకు సబ్సిడీపై అందజేసింది. వాటి విలువ మార్కెట్‌లో సుమారు రూ.2500 వరకు ఉండొచ్చని తెలుస్తోంది. కాగా, ఈ టార్ఫలిన్లు ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి ఎంతో సౌలభ్యంగా ఉండేవి. ఇప్పుడు వాటి సరఫరా నిలిచిపోవడంతో తాము ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. అకాల వర్షాలు కురిస్తే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి రైతులు తీవ్ర నష్టానికి గురవుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆర బోసి, వాటిని కాంటా వేసే వరకు కనీసం 20 రోజులు పడుతుంది. ఈ సమయంలో వర్షాలు పడితే ధాన్యం తడిసిపోతుంది. రాష్ట్ర ప్రభుత్వం టార్ఫలిన్లు ఇవ్వకపోవడంతో ధాన్యం తడుస్తుందన్న భయంతో రూ. రెండు వేల నుంచి రూ. మూడు వేల వరకు అద్దె చెల్లించి తెచ్చుకుంటున్నట్టు రైతులు చెబుతున్నారు. ఈ లెక్కన మండల వ్యాప్తంగా సుమారు రూ॥1.90 కోట్ల నుంచి రూ.2.85 కోట్ల వరకు రైతులపై భారం పడుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సబ్సిడీపై టార్పాలిన్లు అందజేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సబ్సిడీపై ఇవ్వాలి : అగయ్య, రైతు

టార్పాలిన్లు అద్దెకు తెచ్చుకోవడంతో రూ.2500 నుంచి రూ.3వేల వరకు అదనపు భారం పడుతోంది. ప్రభుత్వం సబ్సిడీపై టార్పాలిన్లు ఇస్తే మాకు అనువుగా ఉంటుంది.

సరఫరా కావడంలేదు : మణి, వ్యవసాయ అధికారి

ఐదారేండ్లుగా ప్రభుత్వం నుంచి సబ్సిడీపై టార్పాలిన్లు సరఫరా కావడంలేదు. దాంతో రైతులకు అందించలేకపోతున్నాం. ప్రభుత్వం నుంచి వస్తే రైతులకు అందజేస్తాం.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

- వడ్డీ వ్యాపారుల తీరుపై భగ్గుమన్న ఆర్యవైశ్యులు
- వేధింపులకు పాల్పడ్డ బిజెపి నాయకుని సస్పెన్షన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వడ్డీ వ్యాపారుల వేధింపులతో ఆత్మహత్యకు పాల్పడిన బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆర్యవైశ్యులు డిమాండ్ చేశారు. రోజురోజుకు వడ్డీ వ్యాపారుల ఆగడాలు మితిమీరిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వడ్డీ వ్యాపారుల తీరును నిరసిస్తూ నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఆర్యవైశ్యులు గురువారం నగరంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య నాయకులు మాట్లాడుతూ.. అధిక వడ్డీ వసూలు చేస్తూ కుటుంబంపై దౌర్జన్యం చేసి భయభ్రాంతులకు గురిచేసి తండ్రీకూతురు మృతికి కారకులైన వడ్డీ వ్యాపారులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆర్యవైశ్యుల జోలికి వస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. అప్పు తీర్చేందుకు వారం రోజుల సమయం ఇవ్వాలని బతిమాలినా వడ్డీ వ్యాపారి భయభ్రాంతులకు గురిచేసి తనతో పాటు కూతురితో అసభ్యంగా మాట్లాడారని బాధితురాలు అనురాధ పోలీసులకు ఫిర్యాదు చేసిందని తెలిపారు. బాధిత కుటుంబానికి తాము అండగా ఉంటామని అన్నారు. తండ్రి, కూతుళ్ళ మృతిపై పోలీస్ శాఖ వెంటనే పూర్తి విచారణ చేపట్టి బాధ్యులను శిక్షించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు నగరంలో చోటు చేసుకోకుండా జిల్లా యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.

కూతురు మృతదేహం లభ్యం

వడ్డీవ్యాపారుల వేధింపులతో తీవ్ర మనస్తాపానికి గురై తల్లిదండ్రులు, కూతురు బాసర గోదావరిలో దూకగా.. తల్లిని స్థానికులు రక్షించిన విషయం విధితమే. తండ్రి మృతదేహం బుధవారమే లభించగా.. గురువారం కూతురు మృతదేహం గోదావరిలో పైకి తేలగా.. గజ ఈతగాళ్లు వెలికి తీశారు.

వడ్డీ వ్యాపారి, బిజెపి నాయకుడు రోషన్ లాల్ బోరా సస్పెన్షన్

ఓ కుటుంబాన్ని వేధించి తండ్రీకూతురి ఆత్మహత్యకు కారణమయ్యాడనే ఆరోపణల నేపథ్యంలో బిజెపి నాయకుడిని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు బిజెపి జిల్లా అధ్యక్షులు దినేశ్ కులచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరించిన కారణంగా పార్టీ కంఠేశ్వర్ మండల అధ్యక్షులు రోషన్‌ను సస్పెన్షన్ చేస్తున్నామని, ఈ నిర్ణయం తక్షణమే అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి వాటి పట్ల నాయకులు దూరంగా ఉండాలని సూచించారు.

ఇథనాల్ పరిశ్రమ ప్రాంతాల్లో పర్యటిస్తాం

- రైతు కమషన్ చైర్మన్ కోదండరెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

త్వరలోనే ఇథనాల్ పరిశ్రమల ప్రాంతాల్లో రైతు కమిషన్ పర్యటిస్తుందని రైతు కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి చెప్పారు. గురువారం బిఆర్‌కె భవన్‌లో ఇథనాల్ పరిశ్రమలపై మహబూబ్‌నగర్, నిర్మల్ జిల్లాల రైతులతో ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు పలు ఫిర్యాదులు చేశారు. ఇథనాల్ పరిశ్రమపై అనేక అనుమానాలను లెవనెత్తారు. ఈ కార్యక్రమంలో రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, భవానీరెడ్డి, చెవిటి వెంకన్న యాదవ్‌తోపాటు ఎమ్మెల్సీ కోదండరాం, కెఎల్ఆర్, రిటైర్డ్ ఐఎఎస్ రేమాన్ పీటర్, రైతులు, పర్యావరణవేత్తలు, ఇండస్ట్రీ యాజమాన్యంతో పాటు అగ్రికల్చర్, పొల్యూషన్, ఇండస్ట్రీ అధికారులు పాల్గొన్నారు. ఇథనాల్ ఇండస్ట్రీ వల్ల ఎంత లాభమో కాలుష్యం కూడా అదే స్థాయిలో ఉందన్నారు. ఇరు పక్షాలను సమావేశాలకు పిలిచి మాట్లాడామని చెప్పారు. ఇథనాల్ కంపెనీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతులు కూడా ఇచ్చాయని చెప్పారు. అన్ని పరిశీలించి నివేదిక రూపొందిస్తామని కోదండరెడ్డి చెప్పారు.

సివిల్స్‌కు ఎక్కువగా మనవాళ్లు ఎంపికవ్వాలి

- అప్పుడే రాష్ట్రానికి ప్రయోజనం
- రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం ..
- యుపిఎస్‌సి మెయిన్స్‌కు ఎంపికైన వారికి రూ.లక్ష ప్రోత్సాహకం
- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సివిల్స్‌కు మన వారు ఎక్కువ మంది ఎంపికైతే రాష్ట్రానికి ప్రయోజనం చేకూరుతుందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు. ఎన్నికల ముందు ప్రకటించినట్టుగా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో రావుస్ అకాడమీ సివిల్ సర్వీస్ కోచింగ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉద్యోగాల కల్పనలో భాగంగా ఇప్పటికే 50 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని తరహాలో ఉద్యోగాల భర్తీకి ప్రతి ఏటా వార్షిక క్యాలెండర్ విడుదల చేస్తున్నామని చెప్పారు. ఏ పరీక్ష ఎప్పుడు నిర్వహిస్తామో ముందే తెలియజేస్తున్నామని, ఆ పనిలో భాగంగా ఇప్పటికే గ్రూప్ -1 పరీక్షలు విజయవంతంగా నిర్వహించామని, గ్రూప్ -2 పరీక్షలు నిర్వహించబోతున్నామని వెల్లడించారు. ప్రశ్నాపత్రాల లీకేజీ, ఇతర ఇబ్బందులు లేకుండా విజయవంతంగా ఉద్యోగాల భర్తీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మేధస్సు ఉన్నప్పటికీ నిరుపేదలు, మధ్య తరగతి వారు ఆర్థిక ఇబ్బందులతో యుపిఎస్‌సి పరీక్షలను సాధించడంలో ఇబ్బందులు పడుతున్నారని, అది గుర్తించి వారిని ఆర్థికంగా ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు చెప్పారు. ఇందులో భాగంగా తెలంగాణ నుంచి మెయిన్స్‌కు ఎంపికైన వారికి ఇంధన శాఖ పక్షాన ఒక్కొక్కరికి లక్ష రూపాయలు ప్రోత్సాహకంగా అందించినట్టు తెలిపారు. మెయిన్స్ సాధించి ఇంటర్వ్యూకు ఎంపికైన వారికి కూడా లక్ష రూపాయలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు చెప్పారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి మెటీరియల్, ప్రత్యేక శిక్షణ వంటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రోత్సాహకాలు అందిస్తున్నట్టు వివరించారు. సివిల్ సర్వీస్‌కు ఎంపికై పాలనలో మనవాళ్లు ఎక్కువ మంది ఉంటే సంక్షేమ పథకాలు, బడ్జెట్ రూపకల్పన, ఇతర అంశాల ద్వారా మన రాష్ట్రానికి ఎక్కువ లబ్ధి చేకూర్చే అవకాశం ఉంటుందన్నారు. యుపి క్యాడర్‌లో పని చేస్తున్నప్పటికీ ప్రాంతీయ అభిమానంతో తెలుగు వారైన మోహన్‌రావు, అరుణ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో యుపిఎస్‌సి కోచింగ్ సెంటర్ ప్రారంభించడం అభినందనీయం అన్నారు. ఏ అంశాలపై దృష్టి పెట్టి, ఎలా చదవాలే తెలుసుకుంటే ఎక్కువమంది సివిల్ సర్వీసెస్‌కు ఎంపికయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఉత్తర భారతదేశంలో ఎక్కువ అకాడమీలు అందుబాటులో ఉండటంతో ఆ రాష్ట్రాల నుంచి సివిల్ సర్వీసెస్‌కు ఎక్కువమంది ఎంపికవుతున్నారని తెలిపారు. మన రాష్ట్రానికి మేలు జరగాలంటే పెద్ద సంఖ్యలో సివిల్స్ కోచింగ్ అకాడమీలు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రావుస్ అకాడమీ చైర్మెన్, ఐఎఎస్ డా.మోహన్ రావు, ఐపీఎస్ అరుణ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పత్తిలో తేమ నిబంధనలు సడలించాలి

- ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో సిసిఐ కొనుగోలు కేంద్రం కోసం డిమాండ్
- తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వద్ద రైతుల ధర్నా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పత్తిని పరిశీలిస్తున్న నాయకులు

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, తేమ నిబంధనలు సడలించాలని, కనీస మద్దతు ధర లభించేలా మంత్రి తుమ్మల కృషి చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు డిమాండ్ చేశారు. ఈ నామ్ పేరుతో జెండా పాట లేకుండా పత్తి కొనుగోళ్లు సమర్ధనీయం కాదని తెలిపారు. రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని, పత్తి కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఖమ్మంలోని పత్తి మార్కెట్‌లో కొనుగోళ్లు జరుగుతున్న తీరును యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పోతినేని, రాష్ట్ర కమిటీ సభ్యులు నున్నా నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు తదితరులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట రైతులు నిర్వహించిన ధర్నానుద్దేశించి పోతినేని మాట్లాడారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో కేంద్ర ప్రభుత్వం నిర్ణయం చేసిన అరకొర మద్దతు ధర క్వింటాలకు రూ. 7,521 కూడా లభించే పరిస్థితి లేదన్నారు. రూ.5000 నుంచి రూ.6700 లోపు ధరలకే అధిక మొత్తం పత్తిని కొనుగోలు చేస్తున్నారని తెలిపారు.సిసిఐ తేమ శాతం నిబంధనలు పత్తి రైతులకు తీవ్ర నష్టం చేస్తున్నాయని, తేమ శాతం నిబంధనలు సడలించి పత్తి కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు సమయంలో నిర్ణయం చేసిన ధర కూడా పత్తి కాటాలు సమయానికి కోత పెట్టటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు నష్టం చేసే వారిపై వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వ్యవసాయ సీజన్‌లో అధిక వర్షాలు, తెగుళ్లమూలంగా పత్తి దిగుబడి సగానికంటే తగ్గిపోయిందని తెలిపారు. అరకొరగా పండిన పత్తి అమ్మకంలో రైతులు నష్టపోతున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి రైతులకు మద్దతు ధర అందించే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై విక్రమ్, జిల్లా కమిటీ సభ్యులు, యర్రా శ్రీనివాసరావు, తాళ్ళపల్లి కృష్ణ, శీలం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్ట్రేలియా అభివృద్ధిలో భారతీయులు కీలకపాత్ర

- 'మీట్ అండ్ గ్రీట్'లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

భారతీయులు ఎంతో కష్టజీవులనీ, తమ పని చేసుకుంటూ ఆస్ట్రేలియా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కొనియాడారు. బుధవారం ఆస్ట్రేలియా సిడ్నీలోని ఉడ్‌క్రాఫ్ట్ కమ్యూనిటీ సెంటర్‌లో తెలంగాణ కమ్యూనిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమంలో స్పీకర్ మాట్లాడారు. తెలంగాణ కమ్యూనిటీ ప్రతినిధులు రాజశేఖర్‌రెడ్డి మన్యం, నవనీత్‌రెడ్డి కే, దేవిప్రసాద్ మేక, రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్ .ఏ, డేవిడ్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన దీపావళి సంబురాల్లో స్పీకర్‌తోపాటు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్‌ముదిరాజ్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి. నరసింహాచార్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. తెలుగు వారు ఎక్కడున్నా నోటి నిండా ఆప్యాయంగా పలకరిస్తారని చెప్పారు. సిపిఎ కాన్ఫరెన్స్ కోసం ఆస్ట్రేలియా వచ్చిన తమను ఎయిర్‌పోర్ట్‌లో స్వాగతం పలికి ఆహ్వానించారని తెలిపారు. భారతీయులు శాంతస్వభావులనీ, గొడవల జోలికి పోకుండా తమ పని తాము చేసుకుంటారని కొనియాడారు. అందుకే భారతీయులంటే ప్రపంచంలోని మిగతా దేశాల ప్రజలకు ప్రేమ, అభిమానం ఉందన్నారు. ఉద్యోగ, వ్యాపార అవకాశాల కోసం ప్రపంచ నలుమూలలకు భారతీయులు పోతున్నారని తెలిపారు. 'ఏ దేశ మేగినా ఎందుకాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని, నిలుపరా నీ జాతి నిండు గౌరవం' అని రాయప్రోలు సుబ్బారావు చెప్పిన విషయాన్ని ఆచరిస్తున్నారని చెప్పారు. తెలుగు ప్రజలు రెండు రాష్ట్రాలుగా విడిపోయినా అభివృద్ధిలో అన్నదమ్ముల్లా కలిసిమెలిసి పని చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఫోర్త్ సిటీని అభివృద్ధి చేస్తున్నామన్నారు. యువత కోసం స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిందని తెలిపారు. అన్ని వర్గాల పేద పిల్లలు ఒకే చోట చదువుకునేలా ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మూసీ పునరుజ్జీవనం, హైడ్రా ద్వారా చెరువుల పరిరక్షణ కోసం యుద్ధమే చేస్తున్నారని చెప్పారు.రాష్ట్రంలో సమర్థవంతమైన పారిశ్రామిక విధానంఉందనీ, పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని కోరారు. మన తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యములు కావాలని సూచించారు.

ఫార్ములా-ఇ రేసుపై సిబిఐ విచారణ ఎందుకు?

- కక్షతో అరెస్టు చేయిస్తే జైల్లో ఉండొస్తా.. తర్వాత పాదయాత్ర చేస్తా
- మేఘా కృష్ణారెడ్డి ఇంటిపైకి సిబిఐని పంపే దమ్ము రేవంత్‌రెడ్డికుందా? : కెటిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సమావేశంలో మాట్లాడుతున్న కెటిఆర్

ఫార్ములా-ఈ రేసుతో తెలంగాణకు ఆర్థిక ప్రయోజనం చేకూరిందని, దాని ప్రయోజనం తెలియక తమపై కక్షతో రేవంత్‌రెడ్డి దాన్ని రద్దు చేశారని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారకరామారావు (కెటిఆర్) అన్నారు. ఫార్ములా-ఈ రేసు 2024 కోసం బరాబర్ ప్రభుత్వ ఖజానా నుంచే రూ.55 కోట్లను నిర్వాహకులకు చెల్లించాలని, అవినీతే లేనిదానిపై సిబిఐ విచారణ ఎందుకు అన్నారు. దమ్ముంటే సుంకిశాల గోడ కూలిన విషయంలో మేఘా కృష్ణారెడ్డి ఇంటిపైకి సిబిఐని పంపే దమ్ము సీఎం రేవంత్‌రెడ్డి ఉందా ప్రశ్నించారు. కక్షతో తనను అరెస్టు చేయిస్తే రెండు నెలలు జైల్లో ఉండి యోగా చేసుకుని వస్తాననీ, పునరుత్తేజంతో స్లిమ్ముగా తయారై రాష్ట్రంలో పాదయాత్ర చేస్తానని ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మోటార్ రేసింగ్‌ల గురించి సిఎం రేవంత్‌రెడ్డికి తెలియనట్టుందంటూ ఫార్ములా-1, ఫార్ములా-4, ఫార్ములా-ఈ రేసుల గురించి వివరించారు. గతంలో చంద్రబాబు జీనోమ్ వ్యాలీ పెడితే ఇప్పుడు దాని ఫలితాలు వస్తున్నాయనీ, ప్రపంచంలో మూడింట ఒకవంతు వ్యాక్సిన్లు ఇక్కడ నుంచి సరఫరా అవుతున్నాయని చెప్పారు. హైదరాబాద్ ఎలక్ట్రిక్ వాహనాల కేంద్రంగా మార్చాలనే సదుద్దేశంతోనే ఫార్ములా-ఈను ఇక్కడ నిర్వహించామని తెలిపారు. ఆ రేసు తర్వాత ఇవి పాలసీ తీసుకొచ్చామనీ, తద్వారా 16,331 కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయని వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో కీలకంగా ఉన్న చైనాకు చెందిన బివైడి సంస్థ ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిందనీ, కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో వెనక్కి తగ్గిందని చెప్పారు. ఫార్ములా-ఈ నిర్వహణ వల్ల ప్రభుత్వానికి ఆదాయం వచ్చిందిగానీ తనకు పెద్దగా ఏం మిగలలేదని స్పాన్సర్‌గా వ్యవహరించిన ఎస్‌అర్బన్ పక్కకు తప్పుకుందని తెలిపారు. మరి అలాంటప్పుడు అవినీతి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. 24 రేసు నుంచి ఆ సంస్థ తప్పుకుంటే మరో స్పాన్సర్‌ను తర్వాత వెతుక్కోవచ్చుగానీ, ముందు నిర్వాహకులకు రూ.55 కోట్లు కట్టాలని హెచ్ఎండిఎ నిర్ణయించిందని తెలిపారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ఆ రేసును రద్దు చేశారని విమర్శించారు. దీనివల్ల రేసు నిర్వహించకుండానే ఆ కంపెనీకి అప్పనంగా రూ.55 కోట్లు పోయాయని తెలిపారు. ఆ రేసు రద్దు వల్ల తెలంగాణకు, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజికి నష్టం జరిగిందనీ, ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డిపైనా, మున్సిపల్ శాఖపైనా కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ రేసును నిర్వహించలేని ఆయన 2036 ఒలింపిక్స్ గేమ్స్‌ను హైదరాబాద్‌లో నిర్వహించేలా చూస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఒలింపిక్ గేమ్స్ నిర్వహించాలంటే రూ. మూడు లక్షల కోట్ల దాకా అవసరమనీ, ఆ స్థాయిలో అంతర్జాతీయ ఈవెంట్ నిర్వహించే దమ్ము రేవంత్‌రెడ్డికి ఉందా? అని ప్రశ్నించారు. హైడ్రా బ్లాక్‌మెయిల్ దందా అని విమర్శించారు. హైడ్రా, ఫార్మాసిటీ రద్దు, పేదల ఇళ్లను కూల్చడం వంటి ఘటనలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిన్నదనీ, అందుకే పెట్టుబడులు సరిగా రావడం లేదని చెప్పారు. సిఎం ఇలా దివాళాకోరు చేష్టలు చేస్తుంటే, ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతుంటే అప్పులెలా పుడతాయి? అని ప్రశ్నించారు. హామీలను అమలు చేయకుండా ప్రజల దృష్టి మరల్చే రాజకీయాలు ఎక్కువ కాలం పనిచేయవని సీఎంకు సూచించారు. తనను టార్గెట్ చేయడం మానుకుని హామీలు, గ్యారంటీల అమలుపై టార్గెట్ పెట్టి ముందుకెళ్లాలని హితవు పలికారు. రేవంత్‌రెడ్డి ఉడుత ఊపులకు భయపడే ప్రసక్తే లేదనీ, ఆరుగ్యారంటీలు, 420 హామీల అమలు కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.